kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu


బుధవారం • 22-04-2026

పేజీలు: 4

360° SINGLE TOPIC

కాళేశ్వరం

# కాళేశ్వరం @ క్రాస్ రోడ్స్



లక్ష కోట్ల ఖర్చు.. మూడేండ్లకే కుంగిన మేడిగడ్డ

కమిషన్ నివేదికపై నేడు హైకోర్టులో తుది తీర్పు

ప్రాణహితను పక్కనపెట్టి కాళేశ్వరం ఎత్తుకున్న నాటి సీఎం కేసీఆర్

ఇబ్బడి ముబ్బడిగా అప్పులు.. నేషనల్ జియోగ్రఫీ ఛానల్‌లో గప్పాలు

రాష్ట్రంలో సగం కరెంట్ ప్రాజెక్టు లిఫ్టులకే.. ఏటా ఆ బిల్లులకే రూ. 10,374 కోట్లు

అవినీతిపై నిగ్గు తేల్చిన జస్టిస్ ఘోష్ కమిషన్

నిర్వాకమంతా కేసీఆర్, హరీశ్‌రావుదేనని నివేదిక

హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీంకు హరీశ్ అండ్ టీమ్

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వరమా?.. శాపమా?.. దాదాపు 36 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. లక్ష కోట్లు ఖర్చయింది. డిజైన్ మొదలు నిర్మాణం వరకు లోపాలతో మూడు బ్యారేజీలు నిరుపయోగమయ్యాయి. వాటి రిపేర్లపై ప్రస్తుతం ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. 'ఉత్తర తెలంగాణ రైతాంగానికి జీవధార' అన్నది బీఆర్ఎస్ వాదన. కరప్షన్, కమిషన్‌లతో ప్రజాధనం దుర్వినియోగమైందన్నది కాంగ్రెస్ వాదన.

ఎవరి వాదన ఎలా ఉన్నా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మాత్రం ఈ ప్రాజెక్టు ఆలోచన మొదలు ప్రారంభోత్సవం వరకు అనేక లోపాలు జరిగాయని ఎత్తిచూపింది. 'కాగ్' సైతం ప్రజాధనం దుబారా జరిగిందని, ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్థంగా ఉన్నదని విశ్లేషించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీరు ఎంత అందిందనేది సమాధానం లేని మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ ప్రాజెక్టుకు ఖర్చు చేసిన లక్ష కోట్లలో దాదాపు 84 వేల కోట్ల అప్పులు రాష్ట్ర ఖజానాకు భారంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు బ్యారేజీలు, టన్నెళ్లు, గ్రావిటీ కెనాళ్లు, రిజర్వాయర్లు, పంప్ హౌజ్‌లు, లిఫ్టులు.. అంటూ ఎన్ని చెప్పినా ఇప్పుడది అలంకారప్రాయమే. అవినీతి, అవకతవకలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఎంక్వయిరీ కమిషన్ సుదీర్ఘ విచారణల అనంతరం నివేదిక ప్రభుత్వానికి చేరింది. కేసీఆర్, హరీశ్‌రావు, బ్యూరోక్రాట్లు, ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్ల తప్పిదాలను కమిషన్ ఎత్తిచూపింది.

ప్రభుత్వం అరెస్టు చేస్తుందేమో.. చర్యలు తీసుకుంటుందేమో.. అనే ఆందోళనతో కేసీఆర్, హరీశ్‌రావు సహా నలుగురు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ, వాదనలు ముగిశాయి. తుది తీర్పు ఏప్రిల్ 22న వెలువడనున్నది. ఆగమేఘాల మీద హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే సుప్రీంకోర్టులో సవాలు చేయాలనే కసరత్తు మొదలైంది.

దోషుల్ని వదిలేది లేదని సీఎం రేవంత్ పదేపదే చెప్తున్నారు. సీబీఐ దర్యాప్తు కోసం కేంద్ర హోంశాఖకు లేఖ రాశారు. ప్రాజెక్టులో ఎలాంటి అవకతవకలు జరిగాయి?.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏం తేల్చింది?.. నివేదికలో ఏమున్నది?.. కేసీఆర్, హరీశ్‌రావు ఆందోళన ఏంటి?.. హైకోర్టును ఎందుకు ఆశ్రయించారు?.. విచారణలో జరిగిన వాదనలేంటి?.. రాష్ట్ర ప్రభుత్వం ఏం ఆలోచిస్తున్నది?.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కలం360 డిగ్రీస్ సమగ్ర కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం


## పక్కకు పోయిన ప్రాణహిత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'జలయజ్ఞం'లో భాగంగా గోదావరి నదిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. వార్ధా, వైన్‌గంగ నదుల సంగమంతో ఏర్పడే ప్రాణహిత నది మీద ప్రాజెక్టు కట్టాలన్నది ప్లాన్. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు 2007లో రూ. 17,875 కోట్ల ఖర్చుతో ఆరు జిల్లాల పరిధిలో 12.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. తుమ్మిడిహట్టి దగ్గర నిర్మించాలన్నది ప్రణాళిక. ఆ తర్వాత 2008లో సమీక్ష అనంతరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ. 38,500 కోట్లకు పెంచడంతో పాటు ఆయకట్టు కూడా 16.40 లక్షల ఎకరాలకు పెంచారు. మొత్తం ఏడు లింకులు, 28 ప్యాకేజీలుగా డివైడ్ చేసి కాంట్రాక్టుల అప్పగింత పూర్తయింది. దాదాపు రూ. 11,642 కోట్లు ఖర్చయింది.




## తుమ్మిడిహట్టి నుంచి చేవెళ్ల వరకు

ప్రాణహిత నది మీద తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును నిర్మిస్తే ఎల్లంపల్లి, మేడారం రిజర్వాయర్, కాకతీయ కెనాల్, మోతెవాగు, మిడ్ మానేర్, అనంతగిరి, ఇమాంబాద్, తడకపల్లి, తిప్పారం, పాములపర్తి వరకు చేరి అక్కడి నుంచి హల్దీ వాగు, దౌల్తాబాద్, చేర్యాల, మూసీ, చేవెళ్ల మీదుగా అక్కడి రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. తిప్పారం రిజర్వాయర్ నుంచి నల్లగొండ జిల్లా చిట్యాల వరకు కెనాల్ ద్వారా కొంత నీరు ఇవ్వొచ్చు. కేంద్ర జల సంఘం 2014 అక్టోబరు 24న ప్రాణహిత ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతిని మంజూరు చేసింది. కానీ, ప్రాణహిత దగ్గర తగినంత నీటి లభ్యత లేదంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం (ప్రాజెక్టు అధికారులు) సవరించిన హైడ్రోలాజికల్ స్టడీస్ రిపోర్టును 2014 నవంబరు 24న కేంద్రానికి పంపారు. దాంతో ఆ ప్రాజెక్టు అటకెక్కింది.



## మొత్తం రూ. 1.47 లక్షల కోట్ల అంచనా

ప్రాథమిక స్థాయిలో రీ-ఇంజినీరింగ్ చేసిన తర్వాత కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు బీఆర్ఎస్ హయాంలో కొన్ని మార్పులు జరిగాయి. చివరకు వడ్డీలతో కలిపి అంచనా వ్యయం రూ. 1.47 లక్షల కోట్లకు చేరుకున్నది. అప్పటికే ప్రాణహితకు చేసిన ఖర్చును కూడా కలుపుకుంటే అది రూ. 1.51 లక్షల కోట్లకు చేరుకున్నది. కేంద్ర జల సంఘం రూ. 81,911 కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపింది. ఆ తర్వాత డిజైన్ మార్పు, భూ సేకరణ వ్యయం.. ఇవన్నీ కలిపి దాదాపు లక్షన్నర కోట్లకు చేరువైంది. తొలుత రోజుకు రెండు టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోసేలా డీపీఆర్ రూపొందించినా ఆ తర్వాత మూడవ టీఎంసీకి కూడా ప్లాన్ చేయడంతో అదనంగా రూ. 18,151 కోట్లు అంచనా వ్యయానికి చేరింది. ఇంత ఖర్చు పెరిగినా ఆయకట్టు మాత్రం యథాతథంగా 18.26 లక్షల ఎకరాల కొత్త ఇరిగేషన్, మరో 18.60 లక్షల ఎకరాల స్థిరీకరణే ఉన్నది.






## కాళేశ్వరం నిర్మాణానికి భారీ అప్పులు

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం మొత్తం అంచనా వ్యయం రూ. 81,911 కోట్లు. నిర్మాణానికి ఒకేసారి పరిపాలనాపరమైన అనుమతులు ఇవ్వకుండా ప్యాకేజీల ప్రకారం ఇచ్చింది ప్రభుత్వం. నిధులను సమకూర్చుకోడానికి కేఐపీసీఎల్ (కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్) ఏర్పాటు చేసి బ్యాంకులతో పాటు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, నాబార్డ్ తదితర సంస్థల నుంచి అప్పులను సమకూర్చుకున్నది. ఇందుకోసం 8.25% నుంచి 10.90% చొప్పున వడ్డీ ఫిక్స్ అయింది. దీర్ఘకాలిక రుణాలు కావడంతో ఎక్కువ వడ్డీ భారం తప్పలేదు. తిరిగి తీర్చడం 2022 నుంచి మొదలైంది. కొన్ని నెలవారీ, మరికొన్ని త్రైమాసికం (క్వార్టర్లీ) చొప్పున 2035 సంవత్సరం వరకు కట్టాల్సి ఉన్నది.


### కాళేశ్వరం కోసం బ్యాంకులు, ద్రవ్య సంస్థల నుంచి మంజూరైన రుణం (కోట్ల రూ.లలో)

| | | |
|---|---|---|
| యూనియన్ బ్యాంక్ 7,400 | బరోడా బ్యాంక్ 2,150 | ఆర్ఈసీ 30,536 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ 11,400 | పీఎఫ్‌సీ 37,737 | నాబార్డ్ 8,225 |

మొత్తం **97,449**

## సగం విద్యుత్ కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్టులకే

రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో దాదాపు సగం కాళేశ్వరం ప్రాజెక్టుకే ఖర్చవుతుంది. లిఫ్టులను ఆపరేట్ చేయడానికి 8,459 మెగావాట్ల విద్యుత్ అవసరం. ప్రతీ ఏటా 14,344 మిలియన్ యూనిట్ల వినియోగం. పంపింగ్ సీజన్‌లో రోజుకు సగటున 203 మిలియన్ యూనిట్లు ఖర్చవుతుంది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లిఫ్టుల విద్యుత్ బిల్లులే ఏటా రూ. 10,374 కోట్లు ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతి ఏటా ఆపరేషనల్ ఖర్చు అదనంగా మరో రూ. 272 కోట్లు. కానీ రాష్ట్రంలోని ఇతర అవసరాలకు విద్యుత్ కొరత తలెత్తే ప్రమాదాన్ని గుర్తించి సొంతంగా ఉత్పత్తి అవుతున్నదానికి రెట్టింపుకంటే ఎక్కువే ఇతర వనరుల నుంచి కొనుగోలు చేయక తప్పలేదు.



## రీ-ఇంజినీరింగ్‌తో తెరమీదికి కాళేశ్వరం

ప్రాణహిత దగ్గర నీటి లభ్యత లేదనే కారణంతో దాన్ని రివైజ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్లాన్ చేసింది. రెండింటినీ కలిపి కడతామని కేంద్రానికి వివరించింది. ఇందుకోసం రూ. 85,651 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. తుమ్మిడిహట్టితో పోలిస్తే మేడిగడ్డ దగ్గర నీటి లభ్యత దాదాపు 500 టీఎంసీలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ప్రాణహిత-మిడ్ గోదావరి సంగమం దగ్గర కాళేశ్వరం గ్రామానికి 20 కి.మీ. దిగువన మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించేలా 2016 మార్చి 1న జీవో జారీచేసింది. మూడు బ్యారేజీలు, 17 రిజర్వాయర్లతో 18.26 లక్షల కొత్త ఆయకట్టుతో పాటు 18.60 లక్షల స్థిరీకరణ ఉంటుందని వివరించింది. రీ-ఇంజినీరింగ్‌తో ప్రాజెక్టు వ్యయం 122 శాతం పెరిగింది.




## మానవ అద్భుతంగా వర్ణించిన బీఆర్ఎస్

అతి తక్కువ కాలంలో ఆసియాలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని కేసీఆర్ గొప్పగా చెప్పుకున్నారు. నేషనల్ జియోగ్రఫిక్ ఛానెల్‌తో ఒక ప్రత్యేక ఎపిసోడ్‌ను కాంట్రాక్టు సంస్థల సహకారంతో రూపొందింది. నభూతో.. అనే తీరులో కేసీఆర్ ప్రొజెక్షన్ ఇచ్చారు. కాళేశ్వరం లేకముందు తెలంగాణలో పంటలే పండనట్లుగా, సాగునీటినే చూడనట్లుగా దీన్ని ఒక జీవధార అంటూ కేసీఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది. ప్రారంభోత్సవాన్ని సైతం ఆర్భాటంగా చేసింది. మూడు బ్యారేజీల కాంక్రీట్ స్ట్రక్చర్లు, పంప్ హౌజ్‌లలోని లిఫ్టు పంపుల గురించి విస్తృతంగా ప్రచారం చేసింది. ఒక దశలో 'బాహుబలి పంపులు' అని చెప్పుకున్నది. కాళేశ్వరం కట్టడాలను టూరిస్ట్ స్పాట్ తరహాలో రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వెళ్లి సందర్శించేలా ప్రమోట్ చేసుకున్నది.

## అవినీతి ఆరోపణలపై ఎంక్వయిరీ

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వయిరీ కమిషన్‌ను నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని ఎంక్వయిరీ కమిషన్ 2024 మార్చి 14న ఏర్పాటైంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన డ్యామేజీ, ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవినీతి, నిబంధనల ఉల్లంఘన, ప్రజా ధనం దుర్వినియోగం తదితరాలపై విచారణ జరిపి 2024 జూన్ 30కల్లా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రకారం గడువు జూన్ 30 కల్లా ముగుస్తున్నా ఎంక్వయిరీ పూర్తికాకపోవడంతో ఆరుసార్లు గడువును ప్రభుత్వం పొడిగించింది. చివరకు 2025 జూలై 31న ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను సమర్పించారు.


జస్టిస్ పీసీ ఘోష్

## లోతుగా స్టడీ చేసిన కమిషన్

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన, అవినీతి తదితర అంశాలపై బ్యూరోక్రాట్లు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు.. ఇలా అనేకమందిని దాదాపు ఏడాదిపాటు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లను తీసుకున్నది. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న ప్రభుత్వ సిబ్బందిని కూడా ఎంక్వయిరీ చేసింది. ఇరిగేషన్ నిపుణుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకున్నది. రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు, ద్రవ్య సంస్థల ప్రతినిధుల నుంచీ వివరణ తీసుకున్నది. టెక్నికల్ అంశాలపై ఐఐటీ ప్రొఫెసర్లు సహా వివిధ రీసెర్చి సంస్థల నిపుణుల నుంచి రాతపూర్వకంగా వివరాలను సేకరించింది.



## కమిషన్ ముందు హాజరైన కేసీఆర్, హరీశ్

కాళేశ్వరం ఎంక్వయిరీలో భాగంగా తొలుత ఇంజినీర్లు, అధికారులను విచారించిన జస్టిస్ ఘోష్ బ్యూరోక్రాట్లు, పొలిటీషియన్లను చివరి దశలో విచారించారు. అందులో భాగంగానే అప్పటి ఇరిగేషన్ సెక్రటరీ సోమేశ్ కుమార్, స్మితా సభర్వాల్, రజత్ కుమార్, రిటైర్డ్ ఈ-ఇన్-సీ మురళీదర్, నాగేందర్, హరిరామ్ తదితరులందరినీ విచారించారు. వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. కేబినెట్ తీర్మానాల మొదలు జీవో జారీ, నిధుల విడుదల, కాంట్రాక్టర్లకు పేమెంట్, పర్యావరణ అనుమతుల మంజూరు, డీపీఆర్ ఆమోదం తదితరాలన్నింటిపై వివరాలు రాబట్టారు. కేసీఆర్‌ను 2025 జూన్ 5, 11 తేదీల్లో, హరీశ్‌రావును జూన్ 6న విచారించి వారి నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు.


2019 జూన్ 21న కాళేశ్వరం ప్రారంభోత్సవంలో నాటి గవర్నర్ నరసింహన్, నాటి ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, ఫడ్నవీస్




## మూడేండ్లలోనే కూలిన మేడిగడ్డ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయం తీసుకున్న తర్వాత 2016 మే నెల 2న కన్నేపల్లి దగ్గర అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మూడేండ్ల పాటు నిర్మాణం అనంతరం 2019 జూన్ 21న ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిగింది. పొరుగు రాష్ట్రాల నాటి ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, దేవేంద్ర ఫడ్నవిస్ సహా గవర్నర్ హోదాలో నరసింహన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ప్రాజెక్టులో కీలకమైనవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు. కానీ ప్రారంభోత్సవం జరిగిన మూడేండ్లకే మేడిగడ్డ బ్యారేజీలోని ఏడవ బ్లాకులో 20వ నెంబర్ పిల్లర్ 2023 అక్టోబరు 21న కుంగిపోయింది. ఈ ప్రభావం ఆ బ్లాక్‌లోని మిగిలిన పిల్లర్ల మీద కూడా పడింది. అప్పటికి కేసీఆర్ (ఆపద్ధర్మ) ముఖ్యమంత్రిగా ఉన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ కొన్ని టెక్నికల్ డిఫెక్టులు కనిపించాయి. కానీ ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు.

కుంగిన బ్యారేజీ పిల్లర్లను పరిశీలిస్తున్న ఎన్డీఎస్ఏ ప్రతినిధులు

## ఎన్డీఎస్ఏ, ఇరిగేషన్ నిపుణుల అధ్యయనం

బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సహా పలువురు ఇరిగేషన్ నిపుణులు ఫీల్డ్ స్టడీ చేశారు. భారీ శబ్దంతో పిల్లర్లు కుంగిపోవడంతో తొలుత పేలుడు జరిగిందనే అనుమానాలు వచ్చాయి. ఇరిగేషన్ అధికారి ఫిర్యాదుతో దర్యాప్తు మొదలైంది. ఉద్దేశపూర్వకంగా పేలుడు పదార్థాలతో ధ్వంసం చేశారని, దీని వెనక కుట్ర ఉండి ఉండొచ్చనే ఆరోపణలు వచ్చాయి. అప్పటికి బ్యారేజీలో నీటి నిల్వ భారీగానే ఉండడంతో నిపుణుల సూచన మేరకు మొత్తం నీటిని దిగువకు విడుదల చేయక తప్పలేదు. నీటిని అలాగే నిల్వ ఉంచితే దిగువ ప్రాంతాలు మునిగిపోతాయని నిపుణులు హెచ్చరించారు. డిజైన్‌లో లోపాలతో పాటు నిర్మాణంలోని నిర్లక్ష్యం, క్వాలిటీ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణ అయింది.



## కేసీఆర్, హరీశ్‌రావుదే నిర్వాకమంతా

కాళేశ్వరం ప్రాజెక్టులో అన్ని రకాల ఫెయిల్యూర్స్‌కు కేసీఆర్, హరీశ్‌రావే కారణమంటూ జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక తేటతెల్లం చేసింది. ఏ కారణంగా వీరు బాధ్యులనే అంశాన్నీ వెల్లడించింది. సుమారు 650 పేజీలతో 2025 జూలై 31న ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది. కేసీఆర్‌ను డైరెక్టుగా 'వికేరియస్' బాధ్యుడు అని తేల్చింది. హరీష్ రావు, ఇతరులను ఏయే రూపాల్లో బాధ్యులో వివరించింది. ప్రజా ధనం దుర్వినియోగం, డిజైన్లకు ఆమోదం లభించిన తర్వాత మార్పులు చేయడం, ఒక ఇంజినీర్ అవతారమెత్తి కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం, ఆర్థికపరంగా అవకతవకలు, నిబంధల ఉల్లంఘన, ఇంజినీర్లకు స్వేచ్ఛ ఇవ్వకపోవడం, తరచూ డిజైన్ల మార్పు.. ఇలాంటి అనేక అంశాలను కమిషన్ ఉదాహరణలతో సహా వివరించింది.



## అసెంబ్లీలో తీర్మానంతో..!

జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికను రాష్ట్ర కేబినెట్ 2025 ఆగస్టు 4న లోతుగా చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో టేబుల్ చేసి ప్రభుత్వం చర్చించింది. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకున్నది. చివరకు సీబీఐ విచారణకు ఆదేశించాలన్న ప్రతిపాదనను సభ్యుల ముందు ఉంచింది. దీనిపై వివిధ పార్టీల సభ్యులు వెల్లడించిన అభిప్రాయాల మేరకు సీబీఐ దర్యాప్తుకు అప్పగిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవ ఆమోదం లభించింది. నివేదికలోని అంశాల ఆధారంగా ప్రాజెక్టులోని అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ 2025 సెప్టెంబర్ 2న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర హోంశాఖకు లేఖ రాసి సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరింది.




## సీబీఐలో మొదలైన కదలిక

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ అసెంబ్లీ తీర్మానం, కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వ లేఖ నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య పొలిటికల్ కామెంట్లు ముమ్మరమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తున్నదంటూ బీజేపీ ఎంపీలను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదంటూ బీజేపీ ఎంపీలు కౌంటర్ కామెంట్లు చేశారు. పీసీ ఘోష్ నివేదిక సహా ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం వివరాలు, డాక్యుమెంట్లు, ప్రభుత్వ విభాగల మధ్య కరస్పాండెన్స్, కేంద్రం నుంచి వచ్చిన అనుమతులు.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన వీటన్నింటినీ అధ్యయనం చేసిన సీబీఐ అధికారులు కొన్ని సందేహాలు లేవనెత్తారు. ఇటీవలే రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారులు, ఇరిగేషన్ ఆఫీసర్లు ఢిల్లీకి వెళ్లి నివృత్తి చేశారు. అవసరమైన వివరాలు సమర్పించారు.








## హైకోర్టుకెక్కిన కేసీఆర్, హరీశ్, స్మితా, జోషి

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక తప్పుల తడక అని, విచారణకు నిర్దిష్ట పద్ధతిలో నోటీసులు ఇవ్వలేదని, పూర్తి వివరాలను తమ నుంచి తీసుకోలేదని, ఈ రిపోర్టును రద్దు చేయాలని కేసీఆర్, హరీశ్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎస్‌కే జోషి, ప్రస్తుత ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సభర్వాల్ 2025 సెప్టెంబరులో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించాలని కోర్టును కోరారు. ఈ రిపోర్టును పబ్లిక్ డొమెయిన్ నుంచి తొలగించాలని కోరారు. వీరి విజ్ఞప్తి, విచారణ సందర్భంగా లేవనెత్తిన వాదనలు, ప్రభుత్వం తరఫున ఇచ్చిన వివరణ.. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. పబ్లిక్ డొమెయిన్ నుంచి రిపోర్టును తొలగించాలని, ప్రభుత్వం వీరిపైన ఎలాంటి తొందరపాటు, కఠిన చర్యలు తీసుకోవద్దని స్టే ఉత్తర్వులు జారీచేసింది.

## హైకోర్టు తుది తీర్పుపై ఉత్కంఠ

హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ తదితరులతో కూడిన బెంచ్ 2025 సెప్టెంబరు నుంచి నవంబరు మధ్యలో ఐదు సార్లు విచారించింది. స్టే ఉత్తర్వులను పలుమార్లు పొడిగించింది. కేసీఆర్, హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రి నాయుడు తదితరులు ఫిబ్రవరి-మార్చి నెలల్లో తుది వాదనలు వినిపించారు. కేసీఆర్, హరీశ్‌రావు సహా నలుగురు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు వాదనల ప్రక్రియను గత నెలలోనే పూర్తిచేసింది. తీర్పును రిజర్వులో ఉంచింది. ఈ నెల 8న తీర్పు వెల్లడించనున్నట్లు పేర్కొన్నా కాపీ రెడీ కాలేదన్న కారణంతో తుది తీర్పును ఏప్రిల్ 22న ప్రకటించనున్నట్లు హైకోర్టు క్లారిటీ ఇచ్చింది. తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

## ఆగమేఘాల మీద ఢిల్లీకి హరీశ్



హైకోర్టు తుది తీర్పు వెలువడడానికి రెండు రోజుల ముందే హరీశ్‌రావు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. హైకోర్టు తీర్పు వారికి ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్లు బీఆర్ఎస్ సెంట్రల్ ఆఫీస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఒకవేళ హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోడానికి ప్రభుత్వానికి వెసులుబాటు లభిస్తుంది. అప్పటివరకూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వుల అమలు ఆగిపోతుంది. అరెస్టు లాంటివి జరుగుతాయేమోననే భావనతోనే ఇక్కడ తీర్పు రావడం, అక్కడ అప్పీల్ పిటిషన్ ఫైల్ చేయడం జరిగిపోయేలా బీఆర్ఎస్ ప్లాన్ చేసింది. హైకోర్టు తీర్పు రాకముందే హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లడం వెనక బీజేపీతో రాజీ కుదుర్చుకునే ప్రయత్నమేనని సీఎం రేవంత్ ఆరోపించారు. దీనిపైనా అవసరమైతే విచారణ జరిపించడానికి ప్రభుత్వం సిద్ధమన్నారు.